క్లుప్తంగా

మంచినీటి కనెక్షన్‌ను ఇవ్వండి



తెనాలిఅర్బన్: మంచినీటి కుళాయి కనెక్షన్‌ను ఇవ్వాలని 28వ వార్డుకు చెందిన వ్యక్తి కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రజల నుంచి అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు అర్జీలు స్వీకరించారు. 26వ వార్డులో విద్యుత్ తీగలపైకి వెళ్ళిన చెట్టు కొమ్మలను తొలగించాలని మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు ఉన్న గుంతలను పూడ్చాలని 29వ వార్డులో మురుగు కాల్వల నిర్మాణం చేయాలని, 25వ వార్డులోని స్థలాన్ని సర్వే చేయాలని, 29వ వార్డులో ఖాళీ స్థలం పేరు మార్చాలనే అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. వీటన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తైక్వాండో పోటీల్లో ముగ్గురికి బంగారు పతకాలు



తెనాలిఅర్బన్: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో తెనాలికి చెందిన జెఎస్ ఫిట్‌నెస్ క్లబ్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులకు బంగారు పతకాలు, ఒకరికి వెండి, మరొకరికి కాంస్య పతకం లభించినట్లు క్లబ్ నిర్వాహకులు కె.ప్రసాద్‌బాబు తెలిపారు. పోటీలను ఆదివారం రేపల్లెలో నిర్వహించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం క్లబ్ ఆవరణలో అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కె.శ్రీను, రాజ్‌కుమార్, కృష్ణ, శివ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెనాలిలో యోగా శిక్షణ తరగతులు

తెనాలిఅర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు పట్టణంలోని అన్ని వార్డుల్లో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఐతానగర్‌లోని తులసీదాస్ కమ్యూనిటీ హాల్‌లో, కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో, చినరావూరులోని కమ్యూనిటీ హాల్‌లో, బోసురోడ్డులోని నూతల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో, మారీసుపేటలోని డాక్టర్ పావులూరి కృష్ణ చౌదరి కన్వెన్షన్ హాల్‌లో, 30వ వార్డులోని కమ్యూనిటీ హాల్‌లో, గంగానమ్మపేటలోని శివాలయం వద్ద, బుర్రిపాలెం రోడ్డులోని ప్రియదర్శిని స్కూల్‌లో ఇవి జరుగుతాయని చెప్పారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలందరూ వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు.

పూర్తయిన పింఛన్ల పంపిణీ



తెనాలిఅర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారంతో ముగిసింది. తెనాలి పట్టణంలో మొత్తం 14,952 పింఛన్లకు గాను ఇప్పటి వరకు 14,587 పంపిణీ చేశారు. అంటే సుమారు 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. ఉడా కాలనీకి చెందిన కన్నెగంటి గోపి అనారోగ్యంతో జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వార్డు శానిటేషన్ సెక్రటరీ కొలకలూరు ఉదయకిరణ్ అక్కడకు వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి

తెనాలిరూరల్: ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి చెందిన ఘటన కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేపల్లె మండలం గుడ్డికాయలంకకు చెందిన పులి జగదీష్ (13), ట్రాక్టర్ డ్రైవర్ మోహన్‌తో కలసి కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం రీచ్‌కు ఇసుక కోసం సోమవారం ట్రాక్టర్‌పై వచ్చారు. ట్రాక్టర్ అదుపు తప్పడంతో డ్రైవరు పక్కన కూర్చున్న జగదీష్ ప్రమాదవశాత్తు కిందపడగా, బాలుడి మీదకు ట్రాక్టర్ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కొల్లిపర ఎస్ఐ పి. కోటేశ్వరరావు, సిబ్బంది ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళపై రాయితో దాడి

తెనాలిరూరల్: ఇంట్లో నిద్రిస్తున్న మహిళపై గుర్తు తెలియని బాలుడు రాయితో దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరు తోటకు చెందిన 42 ఏళ్ల లక్ష్మీ లావణ్య ఇంట్లో నిదిస్తుండగా సోమవారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో అలికిడైంది. లేచి చూడగా ఇంట్లోకి వచ్చిన సుమారు 16 ఏళ్లు ఉన్న గుర్తు తెలియని బాలుడు ఆమెపై రాయితో దాడి చేసి గాయపర్చి వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థికి 'కూటమి' కష్టాలు!

- నేటికీ తెనాలి చేరని యూనిఫాం, షూస్
- ఎప్పుడు వస్తాయో చెప్పలేని స్థితిలో అధికారులు
- ఇబ్బందులు పడనున్న విద్యార్థులు



బ్యాగ్‌లు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

తెనాలిఅర్బన్: బడిగంట కొట్టే సమయం ఆసన్నమైంది. కానీ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అందిస్తామన్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లలో కొన్ని నేటికీ తెనాలి చేరలేదు. తొమ్మిది రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నప్పటికీ వాటి ఊసే కన్పించటం లేదు.

తెనాలి పట్టణం, మండల పరిధిలో మొత్తం 99 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 76 ప్రాథమిక పాఠశాలలు, 14 హైస్కూల్స్, 7 ఎయిడెడ్ స్కూల్స్ ఉన్నాయి. ఇవి కాకుండా ఒక ట్రైబుల్ బాలుర స్కూల్, ఒక ట్రైబుల్ బాలికల స్కూల్ ఉన్నాయి. వీటిలో 4572 మంది బాలురు, 5046 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం మొత్తం 9,618 మంది విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్‌లను పంపిణీ చేయాల్సి ఉంది.

నేటికి తెనాలి చేరని యూనిఫాం, షూస్

తెనాలి పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూటమి ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను పాఠశాల పునఃప్రారంభం రోజున పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. కిట్‌లో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, 3 జతల యూనిఫాం, స్కూల్ బ్యాగ్, బూట్లు, రెండు జతల సాక్స్, బెల్టు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం టెక్స్ట్, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్, బెల్ట్‌లను మాత్రమే పంపింది. విద్యార్థులు ధరించే యూనిఫాం, షూస్, సాక్సులను నేటికీ తెనాలి పంపలేదు. 9 రోజుల్లో స్కూల్స్ పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటిని పంపకపోవటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.



తెనాలి చేరిన పాఠ్య, నోటు పుస్తకాలు (ఫైల్)

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రోత్సాహకాలు

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత ప్రభుత్వం జగనన్న విద్యాకానుక పేరిట విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాం, నోట్, టెక్స్ట్ బుక్స్, బూట్లు, రెండు జతల సాక్సు, బెల్ట్‌ను పంపిణీ చేసింది. స్కూల్ ప్రారంభించే లోపే విద్యాశాఖ అధికారులకు ఇవి చేరేవి. స్కూల్స్ పునః ప్రారంభం రోజున వీటిని విద్యార్థులకు ఉపాధ్యాయులు అందజేసే వారు. కానీ నేడు ఆ పరిస్థితి నేడు కన్పించటం లేదు. అలాగే విద్యార్థులకు అమ్మఒడి, నాడు, నేడు పథకం కింద పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన జరిగాయి. కానీ నేటి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాడు-నేడు పథకానికి పూర్తిగా మంగళం పాడింది. పలు పాఠశాలల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యూనిఫాం, షూస్, సాక్సులను తెనాలి పంపడంతో పాటు మధ్యలో నిలిచిపోయిన మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

త్వరలో యూనిఫాంలు వస్తాయి



తెనాలి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన నోట్, టెక్స్ట్, బెల్ట్, స్కూల్ బ్యాగ్‌లు వచ్చాయి. వాటిని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశాం. వాటిని పాఠశాలల పునః ప్రారంభం రోజున ఉపాధ్యాయులు విద్యార్థులకు అందజేస్తారు. యూనిఫాం, షూస్, సాక్సులు తెనాలి నేటికి చేరలేదు. త్వరలో వాటిని ఉన్నతాధికారులు పంపే అవకాశం ఉంది.

–వి జయంతి బాబు,
మండల విద్యాధికారి–2, తెనాలి.

రజక వలంటీర్ సొసైటీచే ప్రతిభా పురస్కారాల పంపిణీ



పంపిణీ చేస్తున్న బొప్పరాజు, లక్ష్మీపతి, అంజిబాబు

తెనాలి: రజక వలంటీర్ సర్వీస్ సొసైటీ (ఆర్‌వీఎస్), తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆదివారం ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు, విద్యా వనరులను పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు పోతార్లంక ప్రసాద్ అధ్యక్షత వహించారు. గుంటూరు-బాపట్ల-పల్నాడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన 100 మంది విద్యార్థులకు ఉపకారవేతనాలు, రీడింగ్ చైర్స్, ప్లాంక్స్, డ్రెస్ మెటీరియల్స్, బ్యాగులు, నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వల్లూరు మహాలక్ష్మీపతి, ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు వందమంది విద్యార్థులకు డ్రెస్ మెటీరియల్ అందించారు. ఆర్‌వీఎస్ సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని 24వ వార్డు కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, పులిగడ్డ నారాయణ రావు సూచించారు. విశ్రాంత ఎస్పీ కె.బాల వెంకటేశ్వరరావు, సంస్థ ప్రధాన కార్యదర్శి పేటేటి శ్రీనివాస్, ఫణిదపు దుర్గ, పెదలంక వెంకటేశ్వర రావు, మునిపల్లి వంశీ, శివనాగేశ్వరరావు, పెదలంక నాంచారయ్య, మోపిదేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

రేపల్లె: సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. తన ఇంటికి వెళ్లే బాట ఆక్రమణకు గురైందని ఆక్రమణలను తొలగించాలని పట్టణానికి చెందిన షేక్ అబ్దుల్ బాషా.. జంపని గ్రామంలోని కుమ్మరిగుంట చెరువును కుమ్మరి సొసైటీ పేరు మీద ఫ్రీ హోల్డ్ చేయాలని అదే గ్రామానికి చెందిన గుమ్మడిదల పద్మ.. 17, 19 వార్డులకు నూతనంగా రేషన్ దుకాణం మంజూరు చేయాలని ఇసుకపల్లికి చెందిన తాడిపర్తి మల్లికార్జునరావు అర్జీలు ఇచ్చారన్నారు. తన భూమిని సర్వే చెయ్యాలని కోరుతూ భట్టిప్రోలు మండలం గొరిగిపూడికి చెందిన ఎడ్ల కావ్య.. అలాగే తన పొలాన్ని సర్వే చేసి హద్దులు చూపించాలని కోరుతూ చెరుకుపల్లి మండలం కనగాలకు చెందిన రాసంశెట్టి శివపార్వతి.. భట్టిప్రోలు మండలం ఓలేరుకు చెందిన డొక్కా విజయలక్ష్మి.. తన పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ పెసర్లంకకు చెందిన దేవాభక్తుని వినోద్ సాయి అర్జీలు ఇచ్చారన్నారు. రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరుతూ 9వ వార్డుకు చెందిన ఐనంపూడి శ్రీకాంత్ అర్జీ దాఖలు చేసినట్లు తెలియజేశారు. ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు.

ఇంటింటికీ రేషన్ విధానాన్ని కొనసాగించాలి

సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎండీయూ ఆపరేటర్‌లు

రేపల్లె: ఎండీయూ రేషన్ వాహనాలను కొనసాగించి పేదలకు ఇళ్ల వద్దకే రేషన్‌ను అందించాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్ డిమాండ్ చేశారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని కొనసాగించి ఎండీయూ వాహనదారులు, అసిస్టెంట్‌లకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎండీయూ ఆపరేటర్‌లు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయటం అమానుషమన్నారు. ఇంటింటికీ రేషన్ విధానంతో రేషన్ సరుకులు కార్డుదారుల ఇంటికే చేరుతున్నాయని, లబ్ధిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో పాటు పలువురికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ పథకంను రద్దు చేయటంతో కార్డుదారులు రేషన్ షాపుల చుట్టూ తిరుగుతూ గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటాయన్నారు. ఎండీయూ వాహనాలు రద్దు చేయటంతో రాష్ట్ర వ్యాప్తంగా 18,500 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. 2027 వరకు ఎండీయూ వాహనాలు కొనసాగించాలని గత ప్రభుత్వ అగ్రిమెంట్ ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం 2025 జూన్1వ తేదీతో రద్దు చేయటం బాధాకరమన్నారు. ఇంకా 20 నెలల ఈఎంఐలు ఉండటంతో వాహనదారులకు బ్యాంకుల నుంచి వేధింపులు మొదలయ్యాయన్నారు. రాజకీయ కోణంతో కాకుండా ప్రజలకు ఉపయోగపడే పథకాన్ని కొనసాగించి వాహనదారులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎండీయూ వాహనాల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.గోపి, సీఐటీయూ నాయకులు కె.ఆశీర్వాదం, రమేష్, మావో, లెనిన్, అంజన్‌కుమార్, రసూల్, గోపి, ధనుంజయ రావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్‌లు

వ్యవసాయ డ్రోన్ అందజేత

దుగ్గిరాల: వ్యవసాయ పనులు నిమిత్తం సబ్సిడీపై డ్రోన్‌ని రైతులకు అందించారు. సోమవారం దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో దేవరపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన కృప కిసాన్ గ్రూపునకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్ మంజూరు కాగా వ్యవసాయ అధికారి పి.శిరీష రైతులకు అందజేశారు. తక్కువ ఖర్చుతో వ్యవసాయ రంగంలో డ్రోన్‌లు రైతులకు ఎరువు మందుల పిచికారీకి ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రోడ్లపై షాపులు ఏర్పాటు చేస్తే సహించం

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలో కొందరు వ్యాపారులు రోడ్లపై షాపులను ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తున్నారని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. చినరావూరులో సోమవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులందరూ తమ షాపులోనే వాటిని చేసుకోవాలని సూచించారు. రోడ్లపైకి వాటిని ఏర్పాటు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మంగళగిరి టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి బాలాజీ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలో సోమవారం మధ్యాహ్న పథక భోజన కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు, మధ్యాహ్న భోజన పథక కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జూలై 9వ తేదీన సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షులు కమలాకర్, నాయకులు వెంకట్, కుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ విగ్రహావిష్కరణ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు నేతాజీ బాల విద్యాలయంలో సోమవారం నేతాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని కరస్పాండెంట్ సీహెచ్ హరినాథ్, ప్రిన్సిపాల్ సీహెచ్ వి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ఎం.సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వి.వెంకటరావులు విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఋషి విద్యాలయం అధినేత తాళ్లూరి శ్రీనివాసరావు, శ్రీ ప్రతిభా స్కూల్ అధినేత లక్ష్మీ ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: కౌలుచట్టంలో సమూలమైన మార్పులు చేసి, యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు అన్నారు. కౌలు రైతులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళగిరి మండలంలోని పంటకాలువల్లోని గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రతి కౌలు రైతుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులను సంవత్సరంలో 200 రోజులు పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులను పాఠశాలలో చేర్పించండి



చిన్నారుల వివరాలు సేకరిస్తున్న ఉపాధ్యాయురాలు సునీత

తెనాలిఅర్బన్: ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ బాలబాలికలను అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే ప్రక్రియ కొనసాగుతుందని తెనాలి మండల విద్యాశాఖాధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతి బాబులు తెలిపారు. పట్టణంలో జరుగుతున్న సర్వేను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా మే 13 నుంచి జూన్ 9 వరకు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించేందుకు సర్వే జరుగుతుందని చెప్పారు. గుర్తించిన చిన్నారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారికి ప్రత్యేక విద్యను అందించడం జరుగుతుందన్నారు. అలాగే వైద్య ధృవీకరణపత్రం, ఇతర రాయితీలను ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు డి.సునీత, వై.రజిని పాల్గొన్నారు.

చేతి రాత అందంగా ఉండేలా చూసుకోండి

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహన్



మాట్లాడుతున్న రామ్‌మోహన్

తెనాలిఅర్బన్: చేతి రాత అందంగా ఉండేలా చూసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహన్ పేర్కొన్నారు. మారీసుపేటలోని ఎస్‌సీఆర్ ఎస్ఎంహెచ్ స్కూల్‌లో చేతి రాత పై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు తమ చేతి రాతను ఏ విధంగా అందంగా తీర్చిదిద్దాలో శిక్షణ ఇచ్చారు. ఇలా చేయడం వలన వీరు విద్యార్థులకు నేర్పిస్తారనే భావనను ఆయన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు డి.ఆదినారాయణ, కె.ఏసుబాబు, సి.హెచ్.నాగేశ్వరరావు, వై.విజయలక్ష్మి, టి.మహాలక్ష్మీ, యు.రామ్‌మోహన్ బృందం పాల్గొన్నారు.

జేఈఈ పరీక్షల్లో సత్తాచాటిన విద్యార్థులు



వివేక విద్యార్థులను అభినందనందిస్తున్న డైరెక్టర్

తెనాలి: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో స్థానిక వివేక విద్యాసంస్థలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను సాధించి, జాతీయ విద్యాసంస్థలైన ఐఐటీల్లో ప్రవేశానికి అర్హత సాధించినట్టు వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ వెల్లడించారు. జేఈఈ మెయిన్స్‌లో 99.37 పర్సంటైల్ సాధించిన తూనుగుంట్ల పవన్‌కుమార్ ఇప్పుడు ఓసీ కేటగిరిలో జాతీయస్థాయిలో 4,759 ర్యాంకులో నిలిచాడని, ఎస్సీ కేటగిరిలో సీహెచ్ మనోజ్‌కుమార్ 3,098 ర్యాంకు, కంచర్ల మనీష్ 3,280వ ర్యాంకుతో మెరిశారని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఆయా విద్యార్థులను అభినందించారు. దేశవ్యాప్తంగా 16 లక్షల విద్యార్థులు జేఈఈ పరీక్షలు రాయగా, వారిలో వివేక విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించటం, తెనాలి ప్రాంతానికి గర్వకారణమన్నారు. సీఈవో ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ ఈ ఏడాది అన్ని పరీక్షల్లోనూ తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. టెన్త్‌లో 595/500, జూనియర్ ఇంటర్‌లో 467/500, సీనియర్ ఇంటర్‌లో 989/1000, సీబీఎస్ఈ టెన్త్‌లో 489/500, 12వ తరగతిలో 94 శాతం మార్కులు సాధించినట్టు వివరించారు. అభినందన సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు, ప్రిన్సిపాల్స్, డీన్స్, ఎన్.సునీల్, ఎస్.శ్రీనివాసరావు, వెంకట్రామ్, మురళి, ఠాగూర్, రాజేష్, నవీన్ పాల్గొన్నారు.

తెనాలిఅర్బన్: జెఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో తెనాలిలోని శ్రీ చైతన్య విద్యాసంస్థలకు చెందిన బి.నక్షత్ర 1532వ ర్యాంకు, ఎ.హాసిని 2174 ర్యాంకు, కె.యశ్వంత్ 2459, వై.వంశీ ఆదిత్య 1984, సిహెచ్.యోహిత 4925 ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ బి.తిరుపతిరావు తెలిపారు. 2500 లోపు నలుగురు, 5000 లోపు ఐదుగురు ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. సోమవారం రత్నాటాకీస్ సెంటర్‌లోని శ్రీ చైతన్య వ్యాస్ భవన్‌లో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీన్ చంద్రశేఖర్, ఏజీఎం దుర్గాప్రసాద్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యల్లోనూ రాణించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె: విద్యార్థులు చదువుతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందించే క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్, కింగ్స్ వే అకాడమీ రేపల్లె ఆధ్వర్యంలో పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల విజేతలకు సోమవారం ఆమె బహుమతులు అందజేసి మాట్లాడారు. అత్యవసర సమయాలలో ఆత్మరక్షణ విద్యలు బాలబాలికలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పోటీలలో రాణించే వారికి గుర్తింపు లభించటంతో పాటు మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కె.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ పోటీలలో జిల్లా నలుమూలల నుంచి 135 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. ఓవరాల్ చాంపియన్ షిప్‌ను రేపల్లెకు చెందిన కింగ్స్ వే అకాడమీ క్రీడాకారులు ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, గుంటూరు క్రీడాకారులు ద్వితీయ స్థానం, చిలకలూరిపేట క్రీడాకారులు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వీరి అభ్యున్నతికి కృషి చేసిన కోచ్‌లను అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నయాబ్ రసూల్, వసతి గృహ అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, నెలబాలుడు, ఎం.శ్రీనివాసరావు, యెండూరి రాజేష్, అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ రంగ, జాయింట్ సెక్రటరీ కె.ప్రసాద్‌బాబు, కోచ్‌లు కె.బాబూరావు, రాజేష్‌వర్మ, సాంబశివరావు, రామకృష్ణ, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు చర్యలు

మంగళగిరి టౌన్: మలేరియా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇందిరా నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఇందిరానగర్ యూపీహెచ్‌సీ, మలేరియా సబ్‌యూనిట్ ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవాల ర్యాలీని నిర్వహించారు. మలేరియా నివారణపై అవగాహనను ఏఎన్ఎమ్‌లు, ఆశాలు, హెల్త్ సెంటర్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ.. మలేరియా వల్ల చలి, వాంతులు, వణుకుతో కూడిన జ్వరం వస్తుందని అన్నారు. దోమ కుట్టిన 8 నుంచి 12 రోజుల్లో లక్షణాలు బయట పడతాయని తెలిపారు. వెంటనే చికిత్స తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి బయట పడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు దీక్షిత, గీత, గ్లోరీ, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్ సైదులు, హెల్త్ అసిస్టెంట్ కడియం శ్రీనివాసరావు, సిబ్బంది, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.